

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**యే దిల్ ఔర్ ఉన్‌కీ నిగాహోంకె సాయే,**

**యె దిల్ ఔర్ ఉన్‌కీ నిగాహోంకె సాయే**

**ముఝే ఘేర్ లేతీ హై బాహోంకె సాయే**

హిందీ సినీ సంగీత జగత్తులో అప్పుడప్పుడు కొన్ని గీతాలు రూపొందుతూంటాయి. ఆ గీతాలు వింటూ, వాటి మాధుర్యాన్ని అనుభవిస్తుంటే, మనస్సు కాదు, ఆత్మ స్పందిస్తుంది. భౌతిక శారీరక పరిధిని దాటి, అనంత ఆకాశం దాటి, విశాల విశ్వాంతరాళాలలో విహరిస్తూ, తనని తాను తెలుసుకోవాలని తపన పడుతుంది. మనసు ఎంతో ఆనందం అనుభవిస్తూంటే లోలోన అంతగా విషాద భావన పెల్లుబుకుతూంటుంది. ఆనందాన్ని అంటి పెట్టుకునే విషాదం ఉంటుంది. కానీ విషాదాన్ని వెన్నంటి ఆనందం ఎందుకు ఉండదో తెలియక మనసు మరింత గాఢమైన అలవికాని ఆనంద విషాదాల నడుమ ఊగిసలాడుతూంటుంది. మామూలు సినిమా పాట అని కొట్టివేసే పాటలు కొన్ని, సంగీతంలో దాగి ఉన్న మహత్తరమైన ఆధ్యాత్మిక ఉపాసన శక్తిని ప్రదర్శిస్తూ, విశ్వకారుడి పద రాజీవముల చేరు నిర్వాణ సోపాన మధిరోహణ చేయు త్రోవ దారి చూపిస్తున్నంత శక్తిమంతమై ఉంటాయి. అలాంటి పాటల్లో అగ్ర తాంబూలం వహిస్తుంది, మామూలు మాటల్లో చెప్పాలంటే జాన్ నిసార్ అఖ్తర్ రాయగా, జయదేవ్ సంగీత దర్శకత్వం వహించిన 'ప్రేమ్ పర్బత్' సినిమాలో లతా మంగేష్కర్ పాడిన ఈ పాట. ఒక మామూలు ప్రేమ గీతం ఇది. కానీ రాళ్ళు విన్నా కరిగి నీరై ప్రవహించే మధురాతి మధురమైన గీతం ఇది. ప్రేమ భావనలోని పరమాత్మను దర్శింపచేయగల శక్తిని అతి సున్నితంగా ప్రదర్శించే పాట ఇది. సంగీతం స్వర తరంగాల ద్వారా ప్రకృతి ప్రేమ విరాట్ స్వరూపాన్ని మనో యవనిక పై ప్రతిష్ఠింప చేస్తూంటే, సాహిత్యం ఆ విరాట్ ప్రకృతి స్వరూపాన్ని అక్షరాలతో చిత్రిస్తూ, శోభాయమానం చేస్తూ, వ్యక్తి మనస్సులో నిద్రాణ స్థితిలో ఉన్న ప్రకృతితో మమేకమై తనను తాను మరచిపోగల లక్షణాన్ని జాగృతం చేసే స్థాయిలో ఉంటే, గానం, సంగీత సాహిత్యాలకు ప్రాణం పోస్తూ, వ్యక్తి శారీరక పరిధిని దాటి ఆనందానుభూతిని పొందే స్థాయికి ఎదిగింప చేస్తూ, సరస్వతీదేవి వీణాతంత్రి నిస్వానంలో నిబిడీకృతమై ఉన్న బ్రహ్మానందానుభూతిని కలిగింపచేస్తూంటే, అలాంటి పాటలను వినటం ఒక యోగం. అనుభవించటం పరమాత్మ భావానుభూతితో సంయోగం! అలాంటి పాట ఇది.

'ప్రేమ్ పర్బత్' సినిమా 1973 నాటిది. అదృష్టం ఏమిటంటే, ఈ సినిమా నిర్మాత తప్పతాగిన మత్తులో సినిమా రీళ్లన్నీ అగ్నికి ఆహుతి చేశాడు. దాంతో 'ప్రేమ్ పర్బత్ ' సినిమా ఒక అమూర్తమైన భావనలా, మిగిలిపోయింది. అది 'యె దిల్ ఔర్ ఉన్‌కీ ' పాటకు ఒక నిర్దిష్టమైన రూపం లేని పరిస్థితి కల్పించింది. కొన్ని పాటలు బయట ఎంత గొప్పగా ఉన్నా, సినిమాలో తెరపై చూడగానే పాటల ప్రభావం తగ్గిపోతుంది. పాటకొక స్పష్టమైన రూపం ఏర్పడటంతో అనంతమైన ఆకాశం ఒక చిన్న పాత్రలో ఒదిగినట్టు, పాట పరిధి పరిమితమై పోతుంది. 'యె దిల్ ఔర్ ఉన్‌కీ' పాటకు అలాంటి దుస్థితి కలగకుండా, నిర్మాత సినిమా రీళ్లన్నీ కాల్చేశాడు. బాధాకరమైన విషయమే అయినా, ఈ పాట ఎలా చిత్రించారో తెలియక పాటకు సంబంధించిన ఆలోచనలు అసంపూర్ణమై పాట పట్ల ఆకర్షణ పెరుగుతుంది. పాట విన్నప్పుడల్లా పాటను ఎలా చిత్రించారో చూడాలన్న ఆలోచన కలుగుతుంది. ఇదీ పాట ఆకర్షణను ఇనుమడింప చేస్తుంది.

నిజానికి, ఈ పాటను జయదేవ్ ప్రైవేట్ పాటగా రూపొందించాడు. కానీ అది విన్న నిర్మాత జయదేవ్‌ను బ్రతిమిలాడి పాటను సినిమాలో వాడుకున్నాడు. సినిమాలో పాట సందర్భం తెలియదు. నాయకుడి సాంగత్యం కోసం తపిస్తూ తన మనసులోని అనంతమైన ప్రేమ భావనను అనంతమైన ప్రకృతిలో దర్శిస్తూ, అణువణువూ ప్రేమానంద పరవశం అయ్యి యువతి హృదయ స్వరం పాడే పాట ఇది అని మాత్రం తెలుస్తూంటుంది. పాటలో భావం, సంగీతం అన్నీ ప్రకృతి అణువణువూ ఉట్టిపడే ప్రేమ భావనను ప్రదర్శిస్తూ అనంతానందాన్ని కలిగిస్తాయి.

తన ప్రియుడిని తలచుకుంటూ, అతని స్పర్శను, అతని కళ్లు ప్రేమభావనతో తనవైపు చూసే చూపును, ఆ చూపుకు కరిగి నీరయ్యే తన దేహాన్ని, దేహం కరిగి నీరయిన తరువాత, దేహ పంజరం విడిచి అనంతాకాశంలో విహరించే ఆత్మానందాన్ని అనుభవానికి తెస్తుందీ పాట. అలాంటి ఓ అందమైన, అమాయకమైన, ప్రేమ ప్రవాహంలో శుద్ధి అయి ఒడలంతా ప్రేమ పులకరింతల మణిహారాల్లాంటి ప్రేమ నీటి బిందువులతో ధగధగలాడే యువతి, పచ్చని చెట్ల నడుమ, ప్రవహించే నదుల నీటి బిందువులు సూర్యకాంతికి ముత్యాల్లా మెరుస్తూంటే, కిరణాల తాకిడికి పులకెత్తినట్టుండే వృక్షతతులతో నిండిన కొండల నడుమ నుండి దూకే జలపాతాల ముత్యాలధారలను చూసి ప్రియుడిని తలచుకుంటూ ఆనంద పరవశమై గానం చేసే యువతిని ఊహించగానే, ప్రకృతి సంగీతమై సంతూర్, వేణువులూదుతూంటే, ఆ లయకు ఊపునిస్తూ మట్కా, గిటార్‌లూ స్పందిస్తూంటే, యువతి ప్రకృతి అయి, ప్రకృతి స్వరం లత గళంలో ఒదిగి పహాడీ రాగంలో ఆలాపన చేస్తూంటే, భౌతిక ప్రపంచం అదృశ్యమైపోతుంది. సుందరమైన సున్నిత భావనల ప్రపంచం మనసైపోతుంది. ఏమి వాయిద్యాల చలనం అది! ఏమి లయ! ఏమి లత స్వరం! మనసు ఆనందంతో అర్ణవమైపోతుంది. కళ్లు బ్రహ్మానంద వర్షపు చినుకులతో తడి అవుతాయి. హృదయం ఆర్ద్రమైపోతుంది. అప్పుడు లత 'అతని ప్రేమ దృక్కుల ఛాయలో ఈ హృదయం, అతని బాహువులతో పరీవృతం అవుతుంది' అంటుంది. అప్పుడు మనసులో కలిగే మహాద్భుతమైన భావనను తెలిపే పదాలు దొరకవు.

సూర్యోదయమౌతూనే, వెలుగు రేకలు స్పృశించటంతో అంతవరకూ నిద్రాణ స్థితిలో ఉన్న జగతి జాగృతమై చైతన్యవంతమవుతున్న దృశ్యం చూస్తూంటే మనసులో కలిగే అవ్యక్తానందానుభూతి లత స్వర ప్రకంపనలు మనస్సు లోలోతుల్లో ప్రతిధ్వనిస్తూంటే కలుగుతుంది.

జాన్ నిసార్ అఖ్తర్ కవిత చిన్న చిన్న పదాలతో అత్యంత మధురమైన భావనను కలిగిస్తుంది. 'నిగా హోం కె సాయే, బాహోంకె సాయే' అన్న పదాల వాడకంతో పాట ప్రభావం పెరుగుతుంది. 'నిగాహ' అంటే 'దృష్టి' , చూపులు అన్న అర్థాలు వస్తాయి. సాధారణంగా ప్రేయసి, ప్రియుల 'చూపుల' దొక ప్రత్యేక భాష. అవి చెప్పే అర్థాలదొక ప్రత్యేక ప్రపంచం. మూడో వ్యక్తికి తెలియని, బోధపడని అద్భుతమైన శృంగార ప్రపంచం అది.

'అభిమాన్' సినిమాలో పెళ్లయిన తరువాత భార్యాభర్తలుగా అమితాబ్, జయభాదురి నడుమ అతి సున్నితమైన దృశ్యాలుంటాయి. వాటిలో పెదిమలపై చూపుడు వేలుంచటం 'ముద్దు'కు సంకేతంలా భావించే దృశ్యం ఒకటి. సినిమాలో పాట పాడుతూ అమితాబ్, పెదిమలపై వేలుంచుతాడు. జయ సిగ్గుల మొగ్గ అవుతుంది. వారిద్దరికీ ప్రత్యేకమైన శృంగార సాంకేతిక భాష అది. ప్రేయసీ ప్రియుల నడుమ 'కళ్ల భాష' అలాంటిది. అతని 'నిగాహోం కె సాయే'లో ఆమె హృదయం అతని బాహువుల నీడలో పరీవృతమై పోతోంది. అంటే అతని దృష్టి తలుపుకు రాగానే, అతని బాహువులు తనను చుట్టివేసిన భావానుభూతి ఆమె అనుభవిస్తోందన్నమాట. పదాలు చిన్నవి. అవి సృష్టించే దృశ్యం గొప్పది. ఆ దృశ్యం కలిగించే భావనలు లోతైనవి. పాటను 'శుద్ధగాంధారం'తో ఆరంభించటంతో పాటకు, భావానికి ఒక 'పవిత్రత' ఒనగూడుతాయి.

ఈ పాట వినగానే ఇదే పహాడ్ రాగంలో అలౌకికానందానుభూతిని కలిగించగల మరో అద్భుతమైన లత గీతం, ఆఖ్రీ ఖత్ సినిమాలోనిది 'బహారోం మేరా జీవన భీ సవారో' అన్న పాట మనసులో మెదులుతుంది. ఖయ్యామ్ ఆ పాటను రూపొందించాడు. ఈ రెండు పాటలలో లత స్వరం సంగీత సరస్వతి వీణా నిక్వణంలా అతి పవిత్రంగా, అలౌకికానుభూతుల ప్రవాహంలా తోస్తుంది.

పాట ఆరంభమవుతూనే వినిపించే సంతూర్, గిటార్, వేణువులు మన కళ్లముందు ఆకాశాని తాకే పర్వతాలు, వాటికి దీటుగా నిలిచే హరిత వృక్షతతులు, జలజలా పారే నదులు, కొండనుండి దూకే జలపాతాలను నిలుపుతాయి. చల్లని గాలి తాకిడికి పులకరిస్తూన్న ప్రకృతితో స్పందించి పులకరించి ప్రేమతో నిండిన హృదయాన్ని అనుభూతికి తెస్తాయి.

పాట ఆరంభంలోనే ప్రకృతి స్వచ్ఛత పరవశింపచేస్తుంది. ప్రకృతిలోని ప్రాకృతిక స్వరాలు మురింపింప చేస్తాయి. ఒక రకమైన అమాయకత్వం, పవిత్ర భావనలు మనసును చుట్టు ముడతాయి. నాయిక ఎలాగయితే నాయకుడి చూపుల

నీడలో, అతని బాహువుల ఛాయలో ఒదుగుతుందో, అలా అతి సున్నితమైన భావనల నీడలో, ప్రకృతి ప్రేరేపిత ప్రేమ భావనల బాహువుల్లో ఒదిగి పోతాము.

**పహాడోంకొ చంచల్ కిరణ్ ఛూము తీ హై**

**హవా హర్ నదీనా బదన్ ఛూముతీ హై**

**యహాసే వహాన్ తకే హై చాహోంకె సాయే**

మనసు ఏది చూడాలనుకుంటే, మెదడు అది చూపిస్తూంది. మెదడు చూసేదే ప్రపంచం. ఇక్కడ ఆమె మనసు శృంగార భావనలతో నిండిపోయింది. ప్రకృతి సర్వం శృంగార రసంతో తొణికిసలాడుతున్నట్టు కనిపిస్తుంది. అణువణువూ శృంగార రసప్రవాహం కనిపిస్తుంది. అతని బాహువులు ఆమెను చుట్టేశాయి. ఇప్పుడామెకు ప్రకృతి స్వరం స్త్రీ పురుష స్పర్శానుభూతి స్పందన మయంగా ద్యోతకమవుతోంది. పర్వతాలను చంచలమైన కిరణాలు ముద్దిడుతున్నాయి /స్పృశిస్తున్నాయి. వాయువు నీటి శరీరం ముద్దిడుతున్నాయి/స్పృశిస్తోంది. ఇటునుంచి అటువరకూ ఎటు చూసినా ప్రేమ భావన నీడలో ఒదిగి కనిపిస్తోంది. అంటే ప్రకృతి సర్వం వారిద్దరి ప్రేమ భావన నీడలో ఒదిగి స్పందిస్తోందన్నమాట.

పాటలోని శృంగార భావాన్ని ఇనుమడింపచేస్తూ, సంతూర్, వేణువు డోలకలు మనసును ఊపేస్తాయి. ఆ లయ ప్రకృతి ఒడిలో, శృంగార రసప్రవాహంలో, ఓలలాడిస్తూ, సున్నిత భావనల తుఫాను తాకిడితో ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. మామూలు సినిమా పాటలో ఇంత శక్తి ఉందా? అని కొందరు ఆక్షేపించవచ్చు. విశ్వమంతా విభుడు ఆవరించి ఉన్నప్పుడు, ప్రతి అణువూ విశ్వ విభుడేకదా! అలాంటప్పుడు సంగీతం సరస్వతి అయినప్పుడు శాస్త్రీయ సంగీతం, సినీ సంగీతం, జానపద సంగీతం, ప్రేయసి పిలుపు, పసి పిల్లవాడి ఏడుపు, తల్లి మాట, గాలి ప్రవాహం, నీటి కదలిక సర్వం సరస్వతిమయమైన సంగీతం విభిన్న రూపాలు.. పాట ఏదైనా అలౌకికానందానుభూతి కలిగించగల మహత్తరమైన శక్తి గలది. అనుభవించే హృదయంలో ఉంది ఈ భావన.

శబ్దంలో హెచ్చు తగ్గులు లేవు. తేడా అనుభవించే హృదయంలో ఉంది.

**లిపట్ తే యే పేడోంసె బాదల్ ఘనేరే**

**యె పల్ పల్ ఉజాలే, యె పల్ పల్ అంధేరే**

**బహుత్ ఠండి ఠండి హై రాహోంకె సాయే.**

'లిపట్ తేయె పేడోంసె బాదల్ ఘనేరే ' అవగానే వేణువు ఎలా మ్రోగుతుందంటే, ప్రియుడు కౌగిలించగానే స్త్రీ శరీరంలో చెలరేగే పులకరింతలు, మైమరపులో చైతన్యవంతంగా తొణికిసలాడే మహదానందానుభూతితో ప్రతిస్పందిస్తూ, వేణువులోని గాలి హొయలు పోతూ, కులకుల నడకతో ఒక అనుభూతికి స్వర రూపం ఇస్తున్నట్టు మ్రోగుతుంది. చిరుగాలి స్పర్శకు నదీ జలంపై పులకలు కలిగినట్టు చెలరేగే చిరు అలలతో, నది చుట్టుకున్న చీరలాంటి నీటిపొర శరీరపు

స్పందనలకు స్పందించి నృత్యం చేస్తున్న భావనను కళ్లముందు నిలిపి హృదయాన్ని ఆనంద పరవశం చేస్తుందీ వేణునాదం.

సాంద్రమైన మేఘాలు ఆకాశాన్ని తాకేట్టున్న పర్వతాలను కౌగిలించుకుంటున్నాయి. చెట్లు ఆకుల సందులనుండి జాలువారుతూ, ఆకులు కప్పగానే అదృశ్యమయ్యే సూర్యకిరణాలు ఒకసారి వెలుగును ప్రసరిస్తున్నాయి. మరో క్షణంలో చీకటితో ముంచెత్తుతున్నాయి. ఈ ప్రేమ దారుల నీడలు సుఖవంతమైనవి అతి శీతలమైనవి అంటోంది. ప్రియుడి స్పర్శకు అలలు అలలుగా చెలరేగే ఆనందానుభూతిని, అత్యంత సుఖవంతమైన మత్తును ఒక క్షణం, అతి తీవ్రమైన చైతన్యాన్ని మరో క్షణంలో పొందే ప్రేయసి అనుభూతికి దృశ్య రూపాన్నిస్తోందీ చరణం. 'యె పల్ పల్ ఉజాలే, యె పల్ ఫల్ అంధేరే'... మత్తు, చైతన్యాల నడుమ ఊగిసలాడే అత్యంత సౌఖ్యానుభూతిని ప్రదర్శిస్తుంది. దారులు అతి శీతలమవటం ఒక ప్రతీక ప్రేమ దారులు మనసును ఆనందమయం చేస్తాయి. ఓ రకమైన ఉత్సాహాన్ని నింపుతాయి.

**ధడక్‌తే హై దిల్ ఇత్‌నీ ఆజాది యోంసే**

**బహుత్ మిల్తె జుల్తే హై ఇన్ వాదియోంసే,**

**మొహబ్బత్ కె రంగీన్ పనాహోంకె సాయే..**

ప్రకృతి అంటేనే స్వేచ్ఛ. ఎవ్వరి ఆదేశాలకు, ఎలాంటి నిబంధనలకు లొంగదు ప్రకృతి. సముద్రంలో అడ్డుగోడలను ఎవరు నిర్మించగలరు? ఎన్ని సంకెళ్లు విధించినా పూచే పూలు పూయక మానవు. ఎదిగే మొక్క ఎదగక మానదు. ప్రవహించే నీరు తన దారి తాను చూసుకుని ప్రవహిస్తూనే ఉంటుంది. ఎంత స్వేచ్ఛ ప్రకృతిలో ఉందో అది ఊహకు అందదు. మానవుడు ప్రకృతిని నియంత్రణలో పెట్టి నిర్దేశించాననుకుంటాడు. అది మూర్ఖత్వం.

**ఇస్ జీవన్‌కీ చడ్తీ ఢల్తీ ధూప్ కొకిస్ నే బాంధా**

**రంగ్ పె కిస్నే పహరే డాలే, రూప్‌కొ కిస్నే బాంధా**

**కాహె యే జతన్ కరే!**

మానవుడు ప్రయత్నిస్తాడు. విజయం సాధించాననుకుంటాడు. కానీ అది భ్రమ. అహంకారం. అంతే! పోయే ప్రాణాన్ని ఎవ్వరూ పట్టి బంధించలేరు. కానీ బంధించాలని ప్రయత్నిస్తాడు మనిషి. కాస్సేపు ప్రాణాన్ని ఆపి విజయం సాధించాననుకుంటాడు. కానీ అది ప్రకృతి దయ తప్ప నిజమైన విజయం కాదు. అందుకే మనిషి స్వేచ్ఛ కోరుకుంటాడు కానీ, బంధనాలలో ఒదుగుతాడు. అదే స్వేచ్ఛ అనుకుంటాడు. 'కిత్‌నా సుఖ్ హై బంధన్‌మే' అని సంతృప్తి పడతాడు. కానీ అసలైన స్వేచ్ఛ ప్రకృతిలో మమేకమై, ప్రకృతితో కలసిపోయి 'త్వమేవాహం ' అవగలిగే స్థాయిలోనే అనుభవానికి వస్తుంది. స్వేచ్ఛ అంటే బోధపడుతుంది. అప్పుడు ఇంతకాలం 'స్వేచ్ఛ ' అనుకున్నది 'భ్రమ ' అని తెలుస్తుంది. అసలైన స్వేచ్ఛను అనుభవించిన తరువాత మామూలు ప్రపంచం అదృశ్యమయిపోతుంది.

ప్రియుడి తలపులతో, ప్రకృతి సర్వం శృంగారమయంగా, ప్రియుడికి ప్రతీకగా భావిస్తూ మమేకమైన యువతికి 'అసలైనస్వేచ్ఛ' అనుభవానికి వచ్చింది. ఇన్ని స్వేచ్ఛలతో హృదయం స్పందించిందంటోంది. స్వేచ్ఛ ఒకటే. పలు రూపాలలో దర్శనమిస్తోంది. కొండలు, నదులు, లోయలు, వృక్షాలు, గాలులు అన్నీ స్వేచ్ఛాయుతమైనవే. ఏదీ ఎవరికీ లొంగదు. ఏదీ పరిమితులను ప్రతిబంధనలనూ ఒప్పుకోదు. ఏదీ బంధనాలలో లొంగదు. ఎంత కంచె కట్టినా చెట్టు దాన్ని దాటి ఎదుగుతుంది. ఎన్ని రాళ్లు పరచినా, వాటి నడుమ చిన్న చిల్లును ఆధారం చేసుకుని వృక్షం ఎదుగుతుంది. అందుకే 'ఎన్ని స్వేచ్ఛలో!' అంటోందామె. ఆమె హృదయం ప్రేమ నీడలో ఒదిగి ఈ స్వేచ్ఛలన్నిటితో మమేకం అవుతోంది.

ప్రేమలోని భౌతికతను లైంగిక రూపంలో ప్రదర్శించి అదే ప్రేమ అనుకుంటోంది సమాజం. కానీ ఎలాగయితే రాతిబొమ్మలో నిలచే విశ్వసృష్టికారుడు, ఆ భౌతిక రూపం దాటి చూస్తే, నిరాకార, నిర్గుణ స్వరూపంలో బోధపడతాడో, అలా లైంగికమనే భౌతిక చర్యను దాటి చూడగలిగే సంపూర్ణ స్వేచ్ఛనిచ్చి ముక్తికి కారణమయ్యే ప్రేమ అసలు స్వరూపం బోధపడుతుంది. ప్రేమ బంధనం కాదు.ఆత్మను భౌతికం నుంచి విముక్తం చేసి, రెక్కల నిచ్చే అనంతమైన స్వేచ్ఛ అని అర్ధమవుతుంది.

ఇదీ ఈ పాట ప్రదర్శించే అసలైన ప్రేమ భావన. పైకి సినిమా పాట. ప్రేమ పాట. ప్రియుడిని తలుస్తూ ప్రేయసి పాడే పాట. ప్రియుడి బాహువుల స్పర్శను స్మరిస్తూ, ఆనందానుభూతిని అనుభవిస్తూ పాడేపాట. తరచి చూస్తే మానవ జీవిత పరిధుల కావల ఒదిగి ఉన్న అనంతమైన భావనను అనుభూతిని తెచ్చే పాట. జాన్ నిసార్ అఖ్తర్ కవితాత్మను పట్టుకుని, భావాన్ని సంగీత రూపంలో ప్రదర్శిస్తూ జయదేవ్ రూపకల్పన చేసిన తీరు సృజనాత్మక ఔన్నత్యానికి తిరుగులేని నిదర్శనం. లత స్వరం మాధుర్యం అనుభవించాలే తప్ప మాటలలో చెప్పలేం. ప్రేమ సృష్టిలో అణువణువు తడసి ప్రకృతి సర్వం ప్రియుడి ఛాయలా దర్శించి పరవశించే యువతి స్వరం అది. ప్రియుడితో సాన్నిహిత్యాన్ని అనుభవించి పలవరించే యువతి స్వరం ఆమెది. భగవంతుడి భావానుభూతిలో మమేకం చెందిన సర్వం మరచి భక్తుడి మైమరుపు స్వరం ఆమెది. అలవికాని ఆనందాల అద్భుతమైన గని ఆమె స్వరం.

ఇలాంటి అమరమైన ప్రేమ భావనకు మొదటి మెట్టయిన 'స్పర్శ'ను లైంగిక పరిధిలో కుదించి, ఆ భావనని ఓ దురదలాఅభివర్ణించి, తలంటుకుంటే పోయే ఓ 'మురికి 'లా ఎంచి, భ్రమరంలా, కీటకంలా, పశువులా అందినంత లైంగికంగా అనుభవించటమే స్త్రీ పురుష సంబంధం అనుకునే వారందరికీ నమస్కరిస్తూ, 'యె దిల్ ఔర్ ఉన్‌కీ ' లాంటి పాటలు ఇలాంటి బండలలో కూడా మట్టి తడిని నింపుతాయి. పులకరింపచేస్తాయి. మన కళాకారుల కళాకౌశలం అలాంటిది. వారికి జోహార్లు.

(మరిన్ని మధురమైన పాటలతో వచ్చే నెల.)